


# ఏంతరైలు

నెలరోజులక్రితం శ్రీరామ నవమి ఉత్సవాలప్పుడు - పుట్టింటికి వచ్చింది కాంతం. వరుసగా నాలుగు రాత్రులు రామాలయంలో హరికథా కాలక్షేపం జరిగింది. కంచి పట్టుచీర కట్టుకుని, పళ్ళెరంలో పూజాద్రవ్యాలుంచుకొని, అరమోడ్పు కన్నుల్లోనుంచి భక్తిచంద్రికల్ని వెదజల్లుతూ- ప్రతిరోజూ హరికథ వినడానికి వచ్చేది కాంతం. స్త్రీలకు శీలం, అణకువ, పతిభక్తీ-యివే ఆభరణాలనే వాడు హరిదాసు. అతడు భగవల్లీలలు వర్ణిస్తూవుండగా - కాంతం ఈశ్వరధ్యానంలో మునిగిపోయేది. పురాణకాలపు సతీమతల్లుల మహిమలను అమ్మలక్కల దగ్గర ప్రస్తావించేది. మొదటిరోజే కాంతం వరలక్ష్మిని ఆకర్షించేసింది. నాలుగు రోజుల మైత్రిలో కాంతాన్నిగూర్చి తానుగ్రహించిన విషయమేమిటంటే-ఆమె చాలా గుణవతి! పతిసేవయే ఆమెకు పరమధర్మం! ఆమెలో లోపమే ఎత్తిచూపలేని సత్ప్రివర్తనకు, మంచితనానికి వరలక్ష్మి చాల ఆశ్చర్యపోయింది.

ఒకసారి సీత వనవాసాన్ని గూర్చి వివరిస్తున్నాడు హరిదాసు "...అయ్యో సీతమ్మతల్లీ! కష్టాల పాములు నిన్నే వదిలిపెట్టలేదే- ఇక నాబోటిదాన్ని మాత్రం ఏం విడిచి పెడతాయి తల్లీ...నావెర్రిగానీ!" అంటూ నిట్టూర్చింది కాంతం. ఈ మాటలు చుట్టూవున్న పదిమందికీ వినిపించాయి. ప్రక్కనే కూర్చునివున్న వరలక్ష్మి అడిగింది. "మీకూ కష్టాలున్నాయంటే నాకు ఆశ్చర్యంగానే వుంది. ఏమిటండీ మీ కష్టాలు ?..."

'అయ్యో - నామతి మండిపోను! ఏదో పరాకున నోరు జారేశాను, నా నోటితో నేను చెప్పలేనమ్మా! ఎన్ని కొట్టినా, ఎన్ని తిట్టినా కట్టుకున్న మగడేకదా?" అంది కాంతం.

వరలక్ష్మి రెట్టించి అడగలేక పోయింది. అయిదు నిమిషాలు గడచిన తర్వాత కాంతమే అంది "పోనీ లెండమ్మా! మీ మనస్సెందుకు బాధ పెట్టాలి- చేసిన పాపం చెప్పుకుంటే పోతుందంటారు. వారేమో మంచి వారే! చెడుసావాసాలకు మరగి అలా తయారయ్యారు. రోజుకు నాలుగు సార్లయినా నన్ను చావ గొట్టందే వుండ లేరు. అందులో ఆయన తప్పుమాత్రం ఏముంది పాపం! తాగుడు మైకం! ఇక నాముద్దుముచ్చటల మాటంటారా- ఆయన్ని అనరాదు. పరాయి ఆడవాళ్ళు ఆయన్ని వలేసి పట్టుకున్నారు. ఆయన కొట్లే ముద్దులు, తిట్లే మురిపాలు అనుకుని నోరు మెదపకుండా వుంటే సరిపోయేది కదూ?...

ఆయన సుఖంకంటే నాకు కావలసింది మాత్రం ఏముంది? కాని, దుఃఖం భరించలేక ఆయనగారి త్రాగుడును, చెడు పాపాన్ని వీలుచిక్కినప్పుడల్లా తూర్పారబడుతుంటాను ఎంత పాపాత్మురాలిని నేను? ఆయనకు యిష్టమైంది నాకెందుకు యిష్టం కాకూడదు!...''

వరలక్ష్మి ఆశ్చర్యపోయింది. ఈమె ఎంత అమాయకురాలు! భర్త దుశ్శీలాన్ని సమర్థించడమేగాక, తాను పాపాత్మురాలనంటూ పశ్చాత్తాపపడుతోంది. ఎంత నిర్మలమైన పతిభక్తి! ఆమె భర్త ఎవడోగాని- అతనిమీద క్రోధమూ, అసహ్యమూ; ఆమెపట్ల కరుణ, సానుభూతి కలిగాయి-వరలక్ష్మికి. తన పుట్టింట వున్నన్నాళ్ళు ఒక పవిత్రమైన దీపశిఖలా వెలిగింది కాంతం పేరు.

ఆమె మెట్టినింటికి మరలివస్తూ వరలక్ష్మితో అన్నది. "వెళ్ళి వస్తానమ్మా! ఎప్పుడైనా మావూరు రావడం జరిగితే-ఒకసారి మా యింటికి వస్తావుకదూ? ...గాంధీ రోడ్డులో వేపచెట్టు ప్రక్కనే మా యిల్లు."

"అలాగే నమ్మా!"

కాంతం ఇంటికి వెళ్ళే అవకాశం ఈనాటికి లభించింది వరలక్ష్మికి. మిత్రురాలి వివాహానికి ప్రొద్దున బయలుదేరి వచ్చింది తాను. భర్తకు వీలుకాని కారణంగా - తాను ఒంటరిగా రావలసి వచ్చింది. అయినా భయంలేదు. ఇది

దూరప్రయాణమేమీ కాదు. రెండూళ్ళ మధ్య దూరం ఏడెనిమిది మైళ్ళకంటే ఎక్కువ వుండదు.

తొమ్మిది గంటలకల్లా వివాహముహూర్తం జరిగిపోయింది. భోజనాలు ముగిసేసరికి పదకొండైంది. వరలక్ష్మి పెండ్లివిడిది నుండి బయలుదేరి, గాంధీరోడ్డు చేరుకొంది. వేప చెట్టు ప్రక్కనున్న యిల్లే కాంతం యిల్లు...

"నమస్కారమండీ!"-వరలక్ష్మి గొంతుక వినగానే అదిరిపడ్డది కాంతం. "మీరా?" దిగ్భ్రమతో ఆ మెకు కాళ్ళు చేతులాడలేదు..."రండి! రండి! కులాసానే గదూ? ...కూర్చోండి...వున్న కుర్చీలన్నీ ఆయనగారి అమృతాని కే ఆహుతైపోయాయి...'అంటూ నడవలో చాప పరచింది.

వరలక్ష్మి కూర్చొంది. కాంతం మంచినీళ్ళతో మర్యాద సలిపింది. కుశలప్రశ్నలు అయినతరువాత - "లేవండమ్మా! భోజనం చేద్దురు..." అంది కాంతం.

"ఇప్పుడే పప్పన్నం తిని వచ్చాను, మీరు భోంచేయండి!"

"అహఁ! అలా కాదు. మీరు మొహమాట పడుతున్నారు...నామాట కేం లెండి! ఆయన తిన్నతరవాత తినడం నా అలవాటని తెలుసుగా మీకు? ఉదయం వెళ్ళారు. మళ్ళీ ఎప్పుడు వస్తారో?...సాయంకాలమే వస్తారో, రాత్రి కూడా గడిపివేసి ఉదయమే వస్తారో..."

వరలక్ష్మి ఒక్కసారి యింటినంతా కలియజూచింది. చాల చిన్న యిల్లు. ఇంటిలో అట్టే సామానులు లేవు. పేద సంసారానికి ప్రతిబింబంలాగుంది. ఒక్కటిమాత్రం వరలక్ష్మిని విస్మయానికి లోను చేసింది. నడవలో ఒకమూల - చేట నిండుకూ-అప్పుడే తినివేసిన మామిడితొక్కలూ, టెంకలూ వున్నాయి.

ఇంతలో-మాసిన బట్టలతోవున్న ఒక బక్కపలచని యువకుడు "కాంతీ" అంటూ హఠాత్తుగా యింటిలోపలికి ప్రవేశించాడు. అతన్ని చూడగానే-వరలక్ష్మి బిడియంతో, భయంతో ఒంటినిండుకు పైటచెరగు కప్పుకొంది...కాంతం ముఖం ఎందుకో వెలవెలబోయింది. ఆమె తన భావాలను కప్పిపుచ్చుకొంటూ "వచ్చారా? ఎంత సుదినం! ఎంత ఆకలితో వచ్చారో! వడ్డించనా?" అంది.

అతడు వరలక్ష్మివైపు ఒకసారి చూచి, లోపలికి వెళ్ళాడు. అతడి వెనుకే కాంతం కూడ వెళ్ళింది. అతడు భార్యతో చిన్నగా అన్నాడు..."ఏమిటే? దెబ్బలా? లేక ఒట్టి చీవాట్లేనా?"

"ఛా! ల్లెండి వేళాకోళం! భోంచెయ్యరూ?"

"నేను హోటల్లో భోంచేసివచ్చానుగా! మళ్ళీనా? ఒకసారి నిన్ను చూచిపోదామని వచ్చానుగానీ..."

"అలా కాదు. మీరు అన్నం తినకపోతే-ఒట్టే!"

"ఇదేంటీ? ఎప్పుడూ లేంది - ఇవాళ నన్ను మీరు అని అంటున్నావు? నాకేమో భయంగా వుంది. పోనీ, ఆవిడెవరు?"

"మా వూరేలెండి చూచిపోదామని వచ్చింది."

కాంతం అన్నం వడ్డించింది. అతడు తింటూవుండగా- "ఏమండీ! అది మానెయ్యరూ?" అంది కాంతం బిగ్గరగా, ప్రార్థనా పూర్వకంగా.

"ఇదిగో! మళ్ళీ అండీ అంటున్నావు. నన్ను మామూలుగానే పిలూ బాబూ! నాకు సిగ్గేస్తుంది."

త్రాగుడు మానెయ్యమని వేడుకుంటున్నదేమో - అనుకున్నది నడవలో కూర్చున్న వరలక్ష్మి. అతడు యిలా అంటూవున్నాడు. "ఏమిటీ? మానెయ్యడమే?...హోటల్లో ఆ వంటవాడి పనికూడా మానేస్తే తరవాత ఎలా బతుకుదామనుకున్నావు?"

కాంతం 'అయ్యో' అంటూ నెత్తి మోదుకున్నది. పళ్ళు పటపట కొరికింది. "దరిద్రపు మొగమా! ఈ ఒక్క పూట నామీద కూకలెయ్యి!" అంటూ తగ్గు గొంతుకతో వురిమింది. అతడు చేతిలో కంచంతో బయటికి వచ్చాడు. కంచంలోని నీళ్ళు పారబోసి మళ్ళీ లోపలికి వెళ్ళిపోయాడు. కాంతం కోపంతో బుసలుగొట్టింది. "ఇప్పుడుగాదు; వుండు నీపని చెబుతాను."

కాంతంపట్ల వరలక్ష్మికి అసహ్యాం కలిగింది. ఇంత భయంకరమైనదా కాంతం నిజస్వరూపం! చేతకాని వ్రతం మీాద ఆమె కెందుకా మోజు? తను మంచిమనిషి అనిపించుకోవడానికి యితరులలో లేనిపోని చెడ్డతనాన్ని ఆరోపించడం కూడా ఒక సూత్రమే! కాంతం చేసిన పనికూడ అదే. ఇక అక్కడ కూర్చోడానికి మనస్కరించ లేదు వరలక్ష్మికి. కాంతం బయటికి రాకముందే, అక్కడినుండి లేచి విడిదికి వచ్చేసింది. పెండ్లికి వచ్చిన బంధువులవద్ద, స్నేహితులవద్ద సెలవుపుచ్చుకొని, సూటుకేసు తీసుకొని స్టేషనుకు వచ్చింది వరలక్ష్మి.

రైలు సిద్ధంగా వుంది.

వరలక్ష్మి గబగబ టిక్కెట్టు కొనుక్కొని, ప్లాట్ ఫారం మీాదికి వచ్చేసింది. ఆడవాళ్ళ బోగీ ముందర నిలబడి, లోపలికి తొంగిచూచింది. లోపల స్త్రీ ప్రయాణీకులెవ్వరూ లేరు. కాని-ఒక్క మగవాడుమాత్రం కూర్చుని వున్నాడు... అతడు కాంతం భర్త! వరలక్ష్మి మళ్ళీ పెట్టెమీాదున్న గుర్తు చూచింది. నిస్సంశయంగా అది అడవాళ్ళ పెట్టె!... వరలక్ష్మి చిరునవ్వు నవ్వుకుంటూ లోపలికి వెళ్ళి, అతనికి ఎదురుగా కూర్చొంది. అతని జుట్టంతా చెదిరిపోయివుంది. ముఖమంతా రక్కి వేసినట్లు, ఎర్రని గీతలతో నిండిపోయింది. చొక్కా చిరిగిపోయివుంది. అతడు ఆమెను చూచి మొహం త్రిప్పుకున్నాడు. వరలక్ష్మి గొంతు సవరించుకుంది ... "ఏమండీ? మీా మూలాన తనకు అవమానం జరిగిందని మీా ఆవిడగారికి కోపమొచ్చిందా?"

అతడు తలవంచుకున్నాడు.

"ఇప్పుడెక్కడికి వెళ్ళిపోతున్నారు?" అంది వరలక్ష్మి.

"ఎక్కడికైనా వెళ్ళిపోతాను. నాగుబాములాంటి మనసు, బుక్కసముద్రం తూమంతనోరు వున్న ఆడదానితో ఎవడు పడగలడు? అయినా - నేను వెళ్ళిపోతానంటే— దానికేమన్నా భయమా, దిగులా? - ఫోఫో! ఇది నూటొక్కటోసారి! నువ్వు మళ్ళీ ఈ యింటికి రాకపోతే నా చెవి గోసుకుంటాను-అంటుందీ?..."

వరలక్ష్మి - అతని అమాయకత్వానికి హృదయ సౌకుమార్యానికి - సన్నగా నవ్వింది. అతని ముఖం సిగ్గుతో చిన్నబోయింది. "పాపం!" అంటూ జాలిగా నిట్టూర్చిందామె. అతడి కళ్లు నీళ్ళతో నిండిపోయాయి. అంతే!

అతడు రైలు దిగేశాడు. రైలు కదిలింది.

...వరలక్ష్మి అతని స్వభావాన్ని ఊహించుకుంటోంది. అతనిదెంత కోమలహృదయం! అది ఆడదానిపాలనలోనైనా పరవశింపగలదు.

...అతడిప్పుడు యింటికే వెళ్ళిపోతాడు. అర్ధాంగి ఒడిలో వాలి ఏడుస్తాడు. ఆమె అతన్ని ఓదార్చి, అలుక దీరుస్తుంది. ఎంత విచిత్రమైన కాపురం!

దాంపత్యాన్ని ఒక రైలుతో పోల్చవచ్చు. ఆ రైలులో వుండేవి రెండు పెట్టెలు. ఒకటి ఆడవారికోసం,

మరొకటి మగవారికోసం... కాని ఈ దంపతుల దాంపత్యం ఒక వింత రైలు! యీ రైలులో - మగవాళ్ళ పెట్టెలో కాంతం, ఆడవాళ్ళ పెట్టెలో ఆమెభర్త ఎక్కి కూర్చున్నారు. రైలుబండి పోతున్నది.

...నెలరోజుల క్రితం - పుట్టింటికి వచ్చినప్పుడు శ్రీరామనవమి ఉత్సవాల్లో అపరసీతాదేవిలా వెలిగిపోయినది యీ కాంతమేనా?...విచిత్రం!

★★